సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



డెమో రైలుకు మోక్షమెప్పుడో..!

నంద్యాల - కడప డెమో రైలును రేణిగుంట వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర మంత్రి కూడా ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. - 8లో



దూసుకొచ్చిన మృత్యువు

ఆటో, ఆల్విన్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. 8 మందికి గాయాలయ్యాయి. బద్వేలు - మైదుకూరు రహదారిలోని నందిపల్లె వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.90	రూ.148



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 261 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	500	582
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 166.960 కిలోలు

గురు దేవుళ్లకు వందనం

ఉత్తమ గురువులకు పురస్కారమాల

నేడు విశాఖలో అవార్డులు ప్రదానోత్సవం

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ విద్య విభాగంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి ఇద్దరు అధ్యాపకులు ఉత్తమ గురువులుగా ఎంపికయ్యారు. ఇందులో పులివెందుల వైఎస్ వీఆర్ఎం ప్రభుత్వ కళాశాలలో సంస్కృతి లెక్చరర్‌గా పనిచేస్తున్న వై. నాగేంద్రమ్మ, నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి నీలవేణిలను ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. వీరు నేడు విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు.

• డాక్టర్ వై. నాగేంద్రమ్మ



పులివెందులలోని వైఎస్ వీఆర్ఎం ప్రభుత్వ బాలికల కళాశాలలో సంస్కృతం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ వై. నాగేంద్రమ్మ ప్రాథమిక విద్యను నల్గొండలో పూర్తి చేశారు. 6 నుంచి 10వ తరగతి వరకు చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమంలో, ఇంటర్, డిగ్రీలను బాపట్ల జిల్లెల్లపూడిలోని మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలలో పూర్తి చేశారు. 2003లో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం పొందిన ఈమె పొద్దుటూరు ఎరుకలయ్య ఆశ్రమంలో చేరారు. ఆ తరువాత 2012లో ఏపీపీఎస్సీ ద్వారా పోటీ పరీక్ష రాసి సంస్కృత లెక్చరర్‌గా ఉద్యోగాన్ని సాధించారు. పలు చోట్ల అధ్యాపకురాలిగా పని చేశారు. తాజాగా పులివెందుల వైఎస్‌వీఆర్ఎం జూనియర్ కళాశాలలో పని చేస్తున్నారు. పిల్లలకు సంస్కృతంపై పట్టుసాధించడంతోపాటు పాఠ్యపుస్తక రచయితగా సేవలందించారు..

• డాక్టర్ పెద్దిరెడ్డి. నీలవేణి...



అన్నమయ్య జిల్లా నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ప్రాథమిక విద్యను మైదుకూరు మండలం లక్ష్మీపేటలో, 6,7 తరగతులను నందిమండలం జెడ్పీ హైస్కూల్లో చదివింది. 8 నుంచి 10వ తరగతి వరకు మైలవరం రెసిడెన్షియల్ స్కూల్లో చదివారు. తరువాత ఇంటర్‌ను కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డిగ్రీని కడప ప్రభుత్వ కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు.. పీజీ, పిహెచ్‌డీలను తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో పూర్తి చేసింది. 1995లో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికైన ఈమె అమ్మయ్యగారిపల్లెలో ఉద్యోగంలో చేరింది. 2012లో లెక్చరర్‌గా ఎంపికైంది. సాహిత్య పరంగా కూడా ఈమెకు మంచి పట్టుంది. వండర్ బుక్ ఆఫ్ అవార్డు, యునెస్కో వారి గౌరవ డాక్టర్‌తో పాటు పలు సాహిత్య కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

బడి గుడిలో కొలువై..
విద్యా వరాలు ప్రసాదించే
అక్షర బ్రహ్మలు.. గురువులు...
పిల్లల జీవిత సౌధానికి
పునాది రాయి వారు..
కలల సంద్రంలో చిక్కిన భావిభారతానికి
ఆశల దారి చూపే చుక్కాని వారు..
అజ్ఞానమనే చీకటి తెరలను చీల్చి
జ్ఞానోదయాన్ని పంచే ప్రభాత సూరీడూ వారే...
అందుకే ఆచార్య దేవో భవగా
పూజింపబడుతున్నాడు...
ఉపాధ్యాయ దినోత్సవ వేళ
గురు దేవుళ్లకు వేల వేల వందనాలు..

కడప ఎడ్యుకేషన్ : అక్కడ వారు వేసే ప్రతి అడుగు గత జ్ఞాపకాల చిహ్నాలే... పుస్తకాల సంచి వేసుకుని పాఠశాలకు వచ్చి చదువుకున్న గుర్తులే. పిల్లలకు పాఠాలు బోధిస్తున్నా తమ చిన్నతనంలో చేసిన సరదా సరదా అల్లర్లే మదిలో మెదులుతాయి. తాము చదువుకున్న పాఠశాల్లోనే ప్రస్తుతం హెచ్‌ఎం, ఉపాధ్యాయులుగా బోధనలను అందిస్తూ పిల్లల్లో సస్ఫూర్తిగా నిలుస్తున్న వారిపై ప్రత్యేక కథనం..

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా..



విద్యార్థులతో కలిసి శ్రీహరికోట పర్యటనలో ఓబుల్‌రెడ్డి(ఫైల్ ఫోటో)

సంబేపల్లి : అన్నమయ్య జిల్లా సంబేపల్లి హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న మార్ల ఓబుల్‌రెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈనెల 5వ తేదిన విశాఖపట్నంలో ఆంధ్ర యానివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో అవార్డును అందుకున్నారు.

మార్ల ఓబుల్‌రెడ్డి బోధనలో మేటి

సంబేపల్లి మండలంలోని యర్రగుంట్ల నందు 1997వ సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా వృత్తిలో చేశారు. అప్పటి నుండి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మండల రిసోర్స్ పర్సన్‌గా సేవలందించారు. అనంతరం 2019లో పదోన్నతిపై జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు చేపట్టి నేటి వరకు అక్కడే సేవలందిస్తున్నారు. ప్రస్తుతం 2023 న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

• ఇక్కడే చదివారు... ఇక్కడే గురువులయ్యారు



ఎడమనుంచి కుడికి ఉన్నవారు దుర్గరాజు, చంద్రయ్య, ప్రసాద్, విశ్వనాథం, శ్రీనివాస్, పెంచల్ దాస్‌లు

చిట్వేలి : వారంతా ఆరవ తరగతి నుంచి పదోతరగతి వరకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. పదో తరగతి తరువాత పాఠశాల వదిలి వెళ్లిన వీరు తిరిగి ఇక్కడికే ఉపాధ్యాయులుగా అడుగు పెట్టారు. వీరిలో ఏబీఎస్ ప్రసాద్ (గణితం) ప్రధానోపాధ్యాయులు కాగా మిగిలిన ఐదు మందిలో దొండ్లవాగు శ్రీనివాసులు, తిరుమల విశ్వనాథంలు (వృత్తి విద్యా ఉపాధ్యాయులు), బాలరాజు, దుర్గరాజు, పాలెంపల్లి చంద్రయ్యలు (భౌతిక శాస్త్రం), పెంచల్ దాసు (చిత్రలేఖనం) ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడు తూ ఇదే పాఠశాలలో చదువుకొని ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆరుగురు పూర్వ విద్యార్థులు ఇదే పాఠశాల లో ఉపాధ్యాయులుగా పనిచేయడం అరుదైన విషయమన్నారు.

గురుశిష్యులే సహోపాధ్యాయులై..


చిట్వేలి : నాడు గురుశిష్యులే.. నేడు సహోపాధ్యాయులు. చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రోజూ కనిపించే విశేష దృశ్యమిది. తెలుగు పండితుడు మందల సుభాష్ చంద్రబోస్ (స్వామీజీ) వద్ద విద్యనేర్చిన శిష్యుడు డేగా నాగార్జున కూడా తెలుగు పండితుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 1998లో ఆకేపాడు పాఠశాలలో తాను 6వ తరగతి చదువుతుండగా చంద్రబోస్ సార్ పాఠం చెప్పే తీరు తమను ఆయనకు దగ్గర చేసిందన్నారు. ఆయన సలహాలతోనే తెలుగు పండితుడుగా ఉద్యోగం సాధించానన్నారు.



మదనపల్లెలో..



సైదాబాను



షంషుద్దీన్

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలోని మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాల పూర్వపు చిత్తూరు జిల్లాలోని మొట్టమొదటి ఉర్దూ పాఠశాల. ఈ పాఠశాలలో 6 నుంచి 10 వరకు చదువుకున్న స్థానిక దేవళంవీధికి చెందిన సైదాబాను డీఎస్సీ 2000 ద్వారా ఉర్దూ పండిట్‌గా ఎంపికై ఇదే పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. 2005లో స్కూల్ అసిస్టెంట్ సోషియల్‌గా ఈ పాఠశాలలోనే పదోన్నతి పొందారు. ఆ సమయంలో తన వద్ద 2006 నుంచి 2012 వరకు 6 నుంచి 10 వరకు చదువుకున్న కె.ఎస్.షంషుద్దీన్ కూడా డీఎస్సీ 2018 ద్వారా ఎంపికై ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. ఇద్దరు కలిసి పనిచేయడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాబుద్ధులు నేర్చుకున్న చోటే..



సహదేవ



రాజారెడ్డి

బాల్యంలో విద్యార్థులుగా చదువుకున్న మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే నేడు గురువులుగా గొప్ప అవకాశం దక్కించుకున్నారు ఇద్దరు ఉపాధ్యాయులు. ఒకరు జీవశాస్త్రం ఉపాధ్యాయులు బుట్టగాళ్ల సహదేవ కాగా, మరొకరు గణిత ఉపాధ్యాయులు చింతపర్తి రాజారెడ్డి.

గురువుకు సత్కారం

– జిల్లాలో 93 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్ : తన జీవితంలో వేలాది మందిని అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు అడుగులు వేయించే ప్రతి ఉపాధ్యాయుడికీ ప్రభుత్వం ఉత్తమ పురస్కారం అందించి సత్కరిస్తోంది. విద్యార్థులను సరైనమార్గంలో నడిపించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పరిచిన మాస్టార్లను ఎంపిక చేశారు. సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాల ప్రదానం చేసి సన్మానించనున్నట్లు డీఈఓ పురుషోత్తం తెలిపారు. రాయచోటిలోని చిత్తూరు మదనపల్లి రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న లయ గార్డెన్‌లో మధ్యాహ్నం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపిక చేసిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని డీఈఓ పురుషోత్తం తెలియజేశారు.

కటిక పేదరికం నుంచి..



కడప ఉర్దూ నగరపాలక బాలుర హైస్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్న జుబేర్ అహమ్మద్‌ది కడప నగరమే. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన కడపలోనే పది వరకు చదివారు. డీఎడ్ రాయచోటి, బిఈడీని రాజంపేటలో పూర్తి చేసి 2010లో ఉద్యోగం సాధించారు. మొట్టమొదటగా కడపలోని నక్కాస్ ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరాడు. తరువాత 2019లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలకు వచ్చాడు. చదువుకున్న పాఠశాలలోనే నేడు మ్యాథ్ టీచర్‌గా పని చేస్తున్నారు.

కష్టపడితే ఫలితముంటుంది...

ఎవరైనా కష్టపడి చదివితే ఫలితం తప్పకుండా ఉంటుందని.. పిల్లలు బాగా చదివి ప్రయోజకులు కావాలని సూచిస్తున్నారు.

• చదువు నేర్చుకున్న చోటే..



రాయచోటిటౌన్ : ఈయన పేరు రాజేంద్రప్రసాద్. రాయచోటి రూరల్‌పరిధిలోని చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్స్‌గా పని చేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పని చేయడం చాలా సంతోషంగా ఉండటమే కాదు అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి తమ గురువులు నేర్పిన క్రమశిక్షణే జీవితాన్ని ఉన్నతస్థానంలో నిలబెట్టిందని అంటున్నారు. తానుకూడా అలాగే పిల్లలకు పాఠ్యాంశాలు బోధిస్తున్నాని వివరించారు.

• నాన్నే గురువు



రాయచోటిటౌన్ : ఈయన పేరు అంబటి జగదీశ్వరయ్య. మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి ఎంతో గౌరవంతో పాటు మంచి గుర్తింపు తెచ్చుకున్న నాన్నే తన గురువని.. ఆయన ఉపాధ్యాయుడిగా ఎంతో క్రమశిక్షణతో తమకు పాఠాలు నేర్పారని నెమరువేసుకున్నారు. ఆయన అడుగు జాడల్లోనే తాను కూడా ఉపాధ్యాయవృత్తిని ఎంచుకున్నానన్నారు. జోనల్ మీట్‌స్థాయిలో వరుసగా క్రీడా ప్రతిభా అవార్డును ఏడు సార్లు అందుకోవడం విశేషం. నాన్న పని చేసిన పాఠశాలలోనే పీఈటీ టీచర్‌గా పని చేస్తుండడం విశేషం.

• పనిలో నిబద్ధత



చిట్వేలి: ఎంచుకున్న వృత్తిపట్ల అంకితభావం, చేసే పనిపై శ్రద్ధ, నిబద్ధత ఉన్నవారు తప్పకుండా విజేతలవుతారు. ఈ విషయానికి గుర్తు పురస్కారం. చిట్వేలి మండలం నుంచి రెండుసార్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా కామాటం వెంకటేశ్వర్లు ఎంపిక కావడం విశేషం. పాత చిట్వేలి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు (అన్నయ్య) పదోన్నతులు ఆశించకుండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగానే కొనసాగుతున్నారు. 2010లో జిల్లాస్థాయిలో, 2012, 2014లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

• ఆదర్శ గురువు మహమ్మద్‌ఖాన్



మదనపల్లె సిటీ : టీచర్‌గా పుస్తకాల్లో పాఠాలతో సరిపెట్టకుండా వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడం పఠాన్ మహమ్మద్‌ఖాన్ ప్రత్యేకత. మదనపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న ఆయన డిఎడ్, బీఎడ్, డైట్‌సెట్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయనకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక అవార్డులతో సత్కరించింది. 2022లో ఉత్తమ సెక్టోరియల్ ఆఫీసర్‌గా అవార్డులను అందుకున్నారు.

• చదువుకున్న చోటే కొలువు



తంబళ్లపల్లె : పిచ్చలవాండ్లపల్లెలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన పి.అశోక్‌రెడ్డి స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. కోసువారిపల్లె ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 1994-95 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేశారు. 2003 డీఎస్సీలో ప్రతిభ చూపి ఉపాధ్యాయుడిగా కొలువుసాధించారు. 2005లో ఉద్యోగంలో చేరాడు. కోసువారిపల్లె ఉన్నత పాఠశాలకు సైన్సు మాస్టర్‌గా 2017లో బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి టీచర్‌గా పనిచేస్తూ, ఉత్తమ ఫలితాలతో మన్ననలు పొందారు.

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం

మదనపల్లె సిటీ : ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ప్రకటించారు. మదనపల్లె బీటీ కాలేజీలో నిర్వహించిన జిల్లా మహాసభల్లో కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మాధవ్, కోటీశ్వరరావులు.. ఉపాధ్యక్షులుగా లోకేష్, ఓబులేష్, అభిరామ్, సహాయ కార్యదర్శులుగా సుబ్రమణ్యం, లూయస, అశోక్, కోశాధికారిగా వినయ్, విద్యార్థిని విభాగ కన్వీనర్‌గా భవిత, కో కన్వీనర్‌గా గంగారాణిలను ఎన్నుకున్నారు.

ఎస్‌ఈగా పదోన్నతి



ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డికి సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పదోన్నతి లభించింది. అయితే ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈయన నెల్లూరు, ప్రొద్దుటూరు, కడప, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఏఈ నుంచి డీఈఈ వరకు విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం రాజంపేట ఈఈగా విధులు నిర్వరిస్తున్నారు.

నేడు మారథాన్ రెడ్ రన్

రాయచోటి: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నేడు (మంగళవారం) రాయచోటిలో మారథాన్ రెడ్ రన్ ఉంటుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి శైలజ తెలిపారు. యూత్ ఫెస్ట్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చిత్తూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మదనపల్లి రింగ్ రోడ్డు వరకు ఉదయం 5.30 గంటల నుండి 6 గంటల వరకు మారథాన్ రెడ్ రన్ ఉంటుందన్నారు.

గడువు లోపు సమస్యలు పరిష్కరించండి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి : 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ చేయాలని సూచించారు. గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి జేసీ, డీఆర్ఓ సత్యనారాయణలు అర్జీలను స్వీకరించారు. కాగా, టి సుండుపల్లె మండలం బొడివారిపల్లికి చెందిన ఫార్మసీ రెండో సంవత్సరం విద్యార్థిని పసుపులేటి లావణ్య తనకు జగనన్న విద్యా దీవెన జమ కాలేదని అర్జీ ఇచ్చారు. పీఎస్ కాల్వకుఎ చెందిన పి.వినోద్ కుమార్ తన తండ్రి పాటూరి చంద్రశేఖర్‌కు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు.గాలివీడు మండలం పక్కిరారెడ్డిపల్లెకు చెందిన కె. సాహెబ్ పీర్ తనకు మంజూరైన ఇంటికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఇలా చాలామంది తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించారు.

ఓట్ల తొలగింపు వెరిఫికేషన్ పూర్తి చేయాలి

– కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఓట్లను తొలగించిన వాటి రీ-వెరిఫికేషన్‌ను ఈనెల 7వ తేదికల్లా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడలోని ఎన్నికల ప్రధాన కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జేసీలతో ఓటర్ తయారీ తదితర ఎన్నికల అంశాలపై వీడియో కాన్ఫిరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫిరెన్సుకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్సు హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 25వ తేదిలోపు ఓటర్ల జాబితాకు సంబంధించి అన్ని మార్పులు, చేర్పుల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పనులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని కలెక్టర్ అన్నారు.

ఉప్పొంగిన కుందూ

చాపాడు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుందూ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్నూలు జిల్లా రాజోలి ఆనకట్ట వద్ద 7,877 క్యూసెక్కులతో వరద నీరు ప్రవహిస్తుండగా, ప్రొద్దుటూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో 11,437 క్యూసెక్కులు ప్రవహిస్తోందని రాజోలి ఆనకట్ట ఏఈ జమాల్ బాషా తెలిపారు. ఆదినిమ్మాయపల్లె వద్ద పెన్నానదిలో నీరు ప్రవహిస్తోంది.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం

– జిల్లా ఎస్పీ గంగాధర్ రావు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆర్ గంగాధర్ రావు పోలీసు అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారితో చర్చించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు స్పందన కార్యక్రమం ద్వారా ఫిర్యాదులను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. వినతులకు ప్రాధాన్యం ఇచ్చి నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎం.ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక పోస్టుకు చరిత్ర (ఉర్దూ మీడియం) పీజీలో 50శాతం మార్కులతో పాస్ అవడంతో పాటు డిగ్రీ ఉర్దూ సెకెండ్ లాంగ్వేజ్ కలిగినవారు అర్హులన్నారు. మరో పోస్టుకు సిరికల్చర్ ఎమ్మెస్సీ లేదా ఎమ్మెస్సీ బాటనీ/ జువాలజీతో పాటు పీజీ సిరికల్చర్ డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అర్హులైనవారు 8వ తేదీ లోపు తమ బయోడేటాను సమర్పించాలని కోరారు.

వైఎస్ ఎంపీపీగా ఎన్నిక



శ్రీనివాసులు

గాలివీడు : గాలివీడు మండల ఉపాధ్యక్షులు-2గా గాలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకటరమణారెడ్డి సమక్షంలో ఎంపీటీసీలు సోమవారం ఈయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రాథమిక సర్వే వేగవంతం

– ఏపీ ఎంఐపి పీడీ రవీంద్రనాథరెడ్డి



మాట్లాడుతున్న ఏపీ ఎంఐపి పీడీ

కడప అగ్రికల్చర్ : ఆంధ్ర ప్రదేశ్ సూక్ష్మ నీటిసాగు పథకం కింద బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించిన ప్రాథమిక సర్వే వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 10,500 హెక్టార్ల బిందు, తుంపర సేద్యం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజనీర్లు ఎంఐడీసీలు, ఎంఐఏఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


మీరజ్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోచంపేటలో నివాసం వుంటున్న మహమ్మద్ మీరజ్ (35) ఆగస్టు 5వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య ముసరాద్ పర్వీన్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు, భర్తకు ఇద్దరు పిల్లలు సంతానం అని తెలిపింది. తన భర్త మసీదులో ఆజా ఇచ్చేందుకు ఆగస్టు 5న వెళ్లి తిరిగి రాలేదని పేర్కొంది. ఆయన ఇంటి నుంచి వెళ్లిన తరువాత కొన్ని రోజులకు వాట్సాప్ కాల్ చేసి తనను వెతకవద్దని, తాను రానని తెలియజేశారని తరువాత మరలా ఫోన్ కాల్ కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది. పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ జయరాముడు తెలియజేశారు.

23 గొర్రెలు చోరీ

కురబలకోట : మండలంలోని చెన్నామర్రిలో చంద్రశేఖర్‌కు చెందిన 23 గొర్రెలు సోమవారం వేకువజామున చోరీకి గురయ్యాయి. వాటి విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ మేరకు ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ ముబీన్ తాజ్ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న ఆటో

పెద్దముడియం : మండలంలోని చిన్నపసుపుల గ్రామ సమీపంలో కల్వర్టును ఆటో ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు నుంచి చిదిపిరాళ్లదిన్నె వెళుతున్న ఆటోలో డ్రైవర్‌తో సహా నలుగురు ప్రయాణికులు ఉన్నారు. చిన్నపసుపుల గ్రామ సమీపంలో మలుపును గుర్తించకుండా వేగంగా వెళ్తున్న ఆటోను నియంత్రించలేక కల్వర్టును డ్రైవర్ ఢీకొట్టాడు. ఈ సంఘటనలో పసుపుల గ్రామానికి చెందిన పల్లె నరసింహ్మారెడ్డి(74) మృతి చెందగా, మిగతా నలుగురు గాయల పాలయ్యారు. వీరిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దూసుకొచ్చిన మృత్యువు


ప్రమాదానికి కారణమైన ఆల్విన్


నాగిరెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడు

- ఆటోను ఢీకొన్న ఆల్విన్
- ఇద్దరు దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలు






గాయపడిన పోతులూరయ్య, సుబ్బరత్నమ్మ , రత్నమ్మ, బిందుశ్రీ, వసంతకుమారి


మృతి చెందిన వెంకటక్రిష్ణయ్య


నాగిరెడ్డి (ఫైల్)

బద్వేలు అర్బన్ : వారంతా కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. ఒకరు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనానికి, ముగ్గురు బి.మఠంలో జరిగే ఓ శుభకార్యానికి వెళుతున్నారు. మిగిలిన వారు బి.మఠం మండలంలోని వారి స్వగ్రామాలకు వెళుతున్నారు. ప్రయాణం ప్రారంభమైన కొద్ది సేపటికే వీరు ప్రయాణిస్తున్న ఆటోపైకి ఆల్విన్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ విషాదకర ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఆరుగురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం బద్వేలు – మైదుకూరు రహదారిలోని నందిపల్లె సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా సిద్దవటం మండలం ఉప్పరపల్లెకు చెందిన మాసావెంకటక్రిష్ణయ్య (77) ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదవీ విరమణ పొందాడు. బ్రహ్మంగారిమఠంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనార్థం బద్వేలులో ఆటో ఎక్కాడు. అలాగే బి.మఠం మండలం చౌదరివారిపల్లె గ్రామానికి చెందిన పోలునాగిరెడ్డి (65) వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవాడు. నెల్లూరు జిల్లా తురకపల్లెలో ఇటీవల అనారోగ్యానికి గురైన తన కుమార్తెను పరామర్శించి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లె గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని కె.సుబ్బరత్నమ్మ, కె.రత్నమ్మ, ఈమె నాలుగేళ్ల కుమార్తె బిందుశ్రీలు బి.మఠంలో జరిగే తమ సమీప బంధువుల గృహ ప్రవేశానికి వెళ్లేందుకు బద్వేలులో ఆటో ఎక్కారు. అలాగే బి.మఠం మండలం సోమిరెడ్డిపల్లెకు చెందిన ఎస్.వసంతకుమారి, గొల్లపల్లెకు చెందిన ఉంటా శ్రీదేవి, నరసన్నపల్లెకు చెందిన సి.నరసమ్మ, గుండాపురానికి చెందిన తరుణ్ కుమార్‌లు బద్వేలులో ఆటో ఎక్కారు. బి.మఠం మండలం కూంచనపల్లెకు చెందిన గంపా పోతులూరయ్య ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో వీరంతా పోతులూరయ్య ఆటోలో మఠంకు వెళ్లేందుకు బయలుదేరారు. ఆటో నందిపల్లె సమీపంలోకి వచ్చేసరికి.. అదే సమయంలో మైదుకూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న ఆల్విన్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో వెంకటక్రిష్ణయ్య, నాగిరెడ్డిలు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో డ్రైవర్ పోతులూరయ్య, వసంతకుమారి, సుబ్బరత్నమ్మ, రత్నమ్మ, బిందుశ్రీ, శ్రీదేవిలకు తీవ్ర గాయాలు కాగా నరసమ్మ, తరుణ్‌కుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి బద్వేలు అర్బన్ పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను 108 వాహనం సాయంతో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఇద్దరి మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఒకరైన నాగిరెడ్డి కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్‌ఐ కె.వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. తీవ్ర గాయాల పాలైన వారిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆల్విన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పరామర్శించిన మైదుకూరు ఎమ్మెల్యే


వైద్యులతో మాట్లాడుతున్న మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బద్వేలు – మైదుకూరు రహదారిలోని నందిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన నాగిరెడ్డి, గాయాలపాలైన పోతులూరయ్య, వసంతకుమారి, నరసమ్మ, శ్రీదేవి, తరుణ్‌కుమార్‌లు మైదుకూరు నియోజకవర్గంలోని బి.మఠం మండల పరిసర ప్రాంతాలకు చెందిన వారు కావడంతో.. విషయం తెలుసుకున్న మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బద్వేలు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించారు. గాయపడిన వారి పరిస్థితి ఏవిధంగా ఉందని ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ వీరనారాయణరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ మస్తాన్‌వలీ, ఇమ్రాన్

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం మండలంలో బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకలోని ముళబాగల్ ఇద్రీనగర్‌కు చెందిన ఎస్.ఇమ్రాన్(27) టైర్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో ముళబాగల్ నుంచి మదనపల్లెకు వస్తుండగా.. రామసముద్రం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని రామసముద్రం ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా, స్థానిక వైద్యులు చికిత్సలు అందించిన అనంతరం పరిస్థితి విషమంగానే ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన కలకడ మండలంలో జరిగింది. కలకడకు చెందిన మస్తాన్‌వలీ వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో వాల్మీకిపురానికి బయలుదేరారు. మార్గంమధ్యలోని బొంతలవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి ద్విచక్రవాహనం నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో వాల్మీకిపురం కమ్యూనిటీ వైద్యశాలకు తరలించగా, చికిత్సల అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఇక్కడి వైద్యులు చికిత్సలు అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కలకడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ గుడికి వెళ్లి వస్తుండగా..

ఓబులవారిపల్లె : మండలంలోని కొర్లకుంట జాతీయ రహదారి వద్ద సోమవారం తెల్లవారుజామున బొలెరో వాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మంగంపేట ఏపీ ఎండీసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న నారదాసు వేంకటేశు ఆదివారం స్నేహితులతో కలిసి బొలేరో వాహనంలో బోయకొండ గంగమ్మ గుడికి వెళ్లారు. తిరిగి మంగంపేట పునరావాస కాలనీకి వస్తూ కొర్లకుంట వద్దకు రాగానే వాహనం అదుపు తప్పడంతో కుడి మోచేయి చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయమైంది. బాధితుడిని తిరుపతి రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వేలూరుకు తరలించారు.

బస్సు, లారీ ఢీ..

పలువురికి గాయాలు


ఢీకొన్న బస్సు, లారీ

గాలివీడు : బస్సు, లారీ ఢీకొని డ్రైవర్లతోపాటు పలువురికి గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి వెలిగల్లు గ్రామం దళితవాడ వద్ద ప్రధాన రహదారిలోని ఎల్లమ్మ గుడి మలుపు వద్ద గాలివీడు నుంచి కదిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. గాలివీడు వైపు వస్తున్న లారీ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు, లారీ డ్రైవర్‌లు భాస్కర్, ఆనంద్‌కు గాయాలు అయ్యాయి. వారిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు కూడా స్వల్ప గాయాలైనట్లు సమాచారం. వెంటనే ఎస్‌ఐ వెంకటశివకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం

దువ్వూరు : మండల పరిధిలోని నేలటూరు మెట్ట వద్ద సోమవారం మధ్యాహ్నం దువ్వూరు –ప్రొద్దుటూరు రహదారిపై ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దువ్వూరుకు చెందిన అర్థాకుల ఉదయ్ కిరణ్ (19) అనే యువకుడు దుర్మరణం చెందగా, అదే గ్రామానికి చెందిన సాయి చరణ్ (22) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వూరులోని అమ్మవారిశాల వీధికి చెందిన అర్థాకుల పట్టాభిరామయ్య కుమారుడు ఉదయ్ కిరణ్, అదే వీధికి చెందిన దండువీరయ్య కుమారుడు సాయిచరణ్ స్నేహితులు. వీరు పనిమీద ప్రొద్దుటూరుకు వెళ్లి పని ముగించుకుని తిరిగి బైక్‌పై దువ్వూరుకు వస్తుండగా.. దువ్వూరు వైపు నుంచి ఆటో వస్తోంది. ఈ రెండు వాహనాలు నేలటూరు గ్రామం మెట్ట వద్ద ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న వారు కిందపడ్డారు. ప్రొద్దుటూరు వైపు నుంచి వస్తున్న మరో ట్రాక్టర్ ఉదయ్ కిరణ్‌ను తొక్కించుకుని పోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్ర గాయాలైన సాయిచరణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు కారణమైన ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

ముద్దనూరు : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ చంద్రమోహన్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరుకు చెందిన ఫక్కీరయ్య (40), ఆయన భార్య ప్రొద్దుటూరుకు వ్యక్తిగత పని మీద వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో చిలంకూరు గ్రామానికి చెందిన చెన్నకేశవరెడ్డి, హరిశ్చంద్రారెడ్డిలు మైలవరం మండలంలోని గుర్రప్ప దేవస్థానానికి వెళ్లి ఇంటికి వస్తున్నారు. మండలంలోని కొత్తపల్లె సమీపంలోకి రాగానే ఫక్కీరయ్య ముందువైపు వెళ్తున్న టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో ఫక్కీరయ్య తలకు తీవ్ర గాయమై, రక్తస్రావం జరిగింది. క్షతగాత్రున్ని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో హరిశ్చంద్రారెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని..


గణేష్ (ఫైల్)

పీలేరు : బొలెరో ఫికప్ వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి పీలేరు – రాయచోటి మార్గం రాయలవారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం సారకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెకు చెందిన గణేష్ (30) ద్విచక్రవాహనంలో సోమవారం రాత్రి పీలేరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. రాయచోటి నుంచి కూరగాయల లోడుతో చెన్నై వెళ్తున్న బొలెరో ఫికప్ వాహనం రాయలవారిపల్లె వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రైలు కింద పడి..


గుర్తుతెలియని యువకుడి మృతదేహం

వాల్మీకిపురం : రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతపర్తి సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద తిరుపతి వైపు వెళ్తున్న నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి 23 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో..

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లెకు చెందిన టి.నగేష్ (40) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. ఆదివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తమ స్వగృహంలో నీటి కోసం మోటారు తగిలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్పృహ తప్పి కింద పడిపోయాడు. ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుల్లాయప్ప తెలిపారు.

దారి కాచి వ్యక్తిపై దాడి


గాయపడిన అక్బర్‌బాషా

మదనపల్లె : నలుగురు వ్యక్తులు దారి కాచి ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు గ్రామం బ్యాంకువీధికి చెందిన ఆవుల వ్యాపారి ఐఎస్.అక్బర్ బాషా(36)కు అదే గ్రామంలోని సమీవుల్లా, ముజాహిద్‌లతో గత కొంతకాలంగా స్థలవివాదం ఉంది. ఇదే విషయమై వారు గతంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో సోమవారం అక్బర్‌బాషా ద్విచక్రవాహనంలో ఇంటి నుంచి మదనపల్లెకు వస్తుండగా, ముదివేడు గ్రామ సమీపంలో సమీవుల్లా, ముజాహిద్, ఆరిఫ్, టైలర్ గౌస్‌లు అటకాయించి కర్రలతో దాడిచేశారు. విచక్షణా రహితంగా కొట్టారు. గాయపడిన అతన్ని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం


మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు

రాయచోటి : పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ గంగాధరరావు భరోసా ఇచ్చారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులతో ఎస్పీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి రావాల్సిన ఏపీజీఎల్ఐ, కారుణ్య నియామకం, ప్రమాదబీమా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తదితర బెనిఫిట్స్ గురించి ఆరా తీశారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలపై సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ నుంచి వారికి రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇబ్బందులు, సమస్యలు ఉంటే తనను నేరుగా కలవవచ్చునని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, రాయచోటి డీఎస్పీ పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్ట్

మదనపల్లె : గంజాయి అక్రమ రవాణా, విక్రయం కేసులకు సంబంధించి ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.30 వేల విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం చంద్రా కాలనీకి చెందిన వెంకటయ్య కుమారుడు తిరుపతయ్య(45) పదేళ్ల క్రితం ఉమ్మడివిశాఖ జిల్లా చింతపల్లెలో నివసిస్తూ గంజాయి రవాణా చేస్తుండే వాడు. మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌కు చెందిన గంగులప్ప కుమారుడు పి.ప్రకాష్(22) గంజాయి వినియోగానికి అలవాటు పడి, తక్కువ ధరకు విశాఖజిల్లా నుంచి తిరుపతయ్య ద్వారా గంజాయి తెప్పించుకునే వాడు. వినియోగానికి పోనూ మిగిలిన గంజాయిని విక్రయిస్తూ చుట్టుపక్కల ప్రాంతాలకు సరఫరా చేసేవాడు. ఈ క్రమంలో ఇటీవల గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై పోలీసులు నిరంతర నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తుండగా, అందిన సమాచారంతో సీటీఎం క్రాస్‌రోడ్స్‌లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో ప్రధాన నిందితులైన తిరుపతయ్య, ప్రకాష్‌ను సోమవారం సీటీఎం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేసిన వారిలో ఎస్‌ఐలు వెంకటేష్, సుధాకర్, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

డెమో రైలుకు మోక్షమెప్పుడో..!


కడప సైడింగ్‌లో నిలిచి ఉన్న నంద్యాల డెమో ప్యాసింజర్ రైలు

- రైల్వే శాఖ ప్రకటించినా అమలు కాని వైనం
- రేణిగుంట వరకు పొడిగించేందుకు ప్రతిపాదనలు
- ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఓబులవారిపల్లె : నంద్యాల – కడప డెమో రైలును రేణిగుంట వరకు పొడిగిస్తున్నట్లు, ఇందుకు రైల్వే శాఖ ప్రతిపాదనలు ఉన్నాయని కేంద్ర మంత్రి కూడా ప్రకటించారు. అయితే రోజులు గడుస్తున్నా పొడిగించలేదు. దీంతో సంవత్సర కాలంగా ఎదురు చేస్తున్న ప్రయాణికుల ఆశలు అడియాశలు అయ్యాయి.

సమయం ఉన్నా.. నడపని వైనం

నంద్యాల ప్యాసింజర్ రైలు నంద్యాలలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరి 9.40కు కడపకు చేరుకుంటుంది. సాయంత్రం 5.30కు కడపలో బయలుదేరి రాత్రి 9.30కు నంద్యాల చేరుకుంటుంది. అయితే ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కడప సైడింగ్‌లో ప్యాసింజర్ రైలు ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో రేణిగుంట వరకు పొడిగించినట్లయితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దాదాపు ఏడు గంటల సమయం ప్రతి రోజు వృథాగా ఉండటం కన్నా.. ఆ సమయంలో 125 కిలోమీటర్ల దూరం ఉన్న రేణిగుంటకు వెళ్లి రావచ్చు. ప్రయాణికులకు నంద్యాల నుంచి నేరుగా తిరుపతికి రైలులో ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. అంతే కాకుండా రేణిగుంట, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు ప్రయాణికులకు నేరుగా నంద్యాలకు రైలు సౌకర్యం కల్పించినట్లు అవుతుంది. దీంతో వ్యాపారస్తులు, తిరుమల భక్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది. రైల్వేశాఖ వారు 130 కిలోమీటర్ల వేగం పేరుతో చాలా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె స్టేషన్‌లలో స్టాపింగ్‌లు తొలగించారు. దీంతో ప్రయాణికులకు బస్సు ప్రయాణాలు తప్పడం లేదు. రద్దీ ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు నంద్యాల డెమో ప్యాసింజర్ రైలును రేణిగుంట వరకు పొడిగించాలని వారు కోరుతున్నారు.

రైల్వే శాఖ స్పందించాలి



నంద్యాల –కడప డెమో ప్యాసింజర్ రైలును రేణిగుంట వరకు పొడిగించాలి. ప్యాసింజర్ రైలును పొడిగించామని రైల్వే వర్గాలు చాలా రోజుల క్రితం తెలిపాయి. అయితే ఇప్పటి వరకు పొడిగించలేదు. రైల్వే శాఖ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

–సుంకేసుల రఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, చెన్నరాజుపోడు, ఓబులవారిపల్లె

ఎంతో ప్రయోజనకరం



డెమో రైలు పొడిగిస్తే నేరుగా నంద్యాలకు ప్రయాణం చేయవచ్చు. అంతే కాకుండా ప్రతి రోజు ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటి వరకు తిరుపతి నుంచి ఈ మార్గంలో నేరుగా నంద్యాలకు ప్యాసింజర్ రైలు లేదు.

– వెంకటసుబ్బారెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు, ఓబులవారిపల్లె